# గమ్యస్థానం

"ప్రసీల్"

'నేను ఒకానొకప్పుడు నీలాగనే ఖద్దరు జుబ్బా తేసుకొని, ఖద్దరు ధోవతి కట్టుకొని, ఖద్దరు కండువా పైన వేసుకొని, గాంధీగారి శిష్యుణ్ణని కాంగ్రెసుకి జై అనేవాణ్ణే...కానీ, ఇప్పటికి జ్ఞానోదయం కల్గింది...ఇప్పటికి తెలిసొచ్చింది...'

కోటీశ్వర రావు వినలేక పోయాడు. తలమీద గాంధీ టోపీతో పుట్టిన కోటీశ్వర రావుకి ఈ మాటలు నచ్చలేదు. నచ్చవు కూడా.

డాక్టరు చెప్తూనే వున్నాడు.

'...ఇప్పటికి వెలుతురులోకి వచ్చాను. చీకటి గాంధాంధకారాన్ని చీల్చుకుంటూ ఒక వెలుతురు తీగ దూసుకుపోయింది. ఇంకా ఈ చీకట్లో తన్నుకులాడే, నా సోదరులను చూస్తే జాలేసుంది.'

కోటీశ్వరరావుకు కోపం వచ్చింది. తనమీద జాలి చూపెడ్తున్న ఈ డాక్టరుమీద మండిపడ్డాడు.

ఇంటి కెళ్ళాడు. డాక్టరు సంగతి పూర్తిగా తెలుసుకోవా లనుకున్నాడు. డాక్టరు రూము కొచ్చాడు.

'డాక్టరు! మొపాసాను గురించి విన్నావా?'

'మొపాసా? మొపాసా అంటే షేక్స్పియర్ కాదన్నమాట మాత్రం తెలుసు. పోనీ మొపాసా ఏం కనిపెట్టాడు?'

కోటీశ్వర రావు అదురుకున్నాడు. మనిషికి తిండెంత అవసరమో మొపాసా తెలిసుండటం అంత అవసరం అనుకున్న కోటీశ్వరరావుకి ఇది ఓ షాక్.

ఇహ ఇట్లా లాభంలేదని కండువా తీసి నడుంకి కట్టి, తలపై కెగశేసి, పండ్లు బిగించి పెదిమల మధ్య సిగరెట్టు అదిమిపట్టి, నిప్పుల్లను గట్టిగా గీసి 'డాక్టర్, దేవుడున్నాడని నమ్ముతావా?' అని గర్జించాడు.

'రబ్బిష్' అన్నాడు డాక్టరు. కోటీశ్వర రావు లేచి వెళ్ళిపోయినాడు.

♦ ♦ ♦

డాక్టర్ డబుల్ నిమోనియాతో బాధపడుతున్నాడు. కోటీశ్వర రావు వెళ్ళాడు.

'డాక్టర్! ఒంట్లో బాగా లేదా?'

'శ్రీరామచంద్ర. ఎక్కువకాలం బతకనోయ్!'

కోటీశ్వర రావుకి ఆశ్చర్య మేసింది. 'చాలా బాధగా వున్నదా?'

'బాబూ, బతకను. ఆ శ్రీరామచంద్రుడు ఎప్పుడు తీసుక వెళ్తాడో కాని...'

కోటీశ్వరరావు కళ్ల నీళ్లు కార్చాడు.

♦ ♦ ♦

డాక్టరు చనిపోయినాడు. కోటీశ్వర రావు చాలా రోజులు కష్ట పడ్డాడు. తనకూ, డాక్టరుకూ, ఏ విషయంలో కాని పడకపోయినా, ఎందుకో ఏమిటో, డాక్టరంటే జాలి, ప్రేమ ఫీల్ అయ్యేవాడు.


కొత్త తరహా * * *

* వ్యంగ్య రచనలు
* వ్యంగ్య చిత్రాలు
* అతి చిన్న కథలు
* పొట్టి నాటికలు
* తేలికైన వ్యాసాలు
* ఘాటైన విమర్శలు కావాలి

ప్రకటింపబడిన రచనలకూ, వ్యంగ్యచిత్రాలకూ తగినప్రతిఫలం ఇవ్వబడును.

తొలిసారి కలంపట్టి వ్రాసే ఉత్సాహవంతుల ప్రయత్నాలకు తగినంత చేయూతనూ ప్రోత్సాహాన్ని ఇవ్వడం మా ప్రథమ కర్తవ్యం.

ఆనందవాణి, 12, తంబుశెట్టివీధి, మద్రాసు